ప్రజాశక్తి
మంగళవారం 5 నవంబర్ 2024
5
శ్రీ సత్యసాయి

నేడు జెఎన్‌టియులో ఆధునిక కంప్యూటర్ సైన్స్ సదస్సు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నాడు ఆధునిక కంప్యూటర్ సైన్స్ సదస్సు ప్రారంభం కానుందని సదస్సు కోఆర్డినేటర్ ఎపి.శివకుమార్ తెలిపారు. అబ్దుల్ కలాం సెమినార్ హాల్ నందు సీఎస్ఈ, ఎఐసిటిఈ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఆధునిక కంప్యూటింగ్ (సూపర్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్) అనే అంశంపై మూడు రోజులు పాటు సదస్సు నిర్వహిస్తునట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి అధ్యక్షత జరిగే సదస్సుకు ముఖ్య అతిథిగా జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి ఆచార్య హెచ్.సుదర్శన హాజరవుతారని తెలిపారు. 7న ముగింపు కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య హాజరవుతారని తెలిపారు. సదస్సులో నిపుణుల ప్రసంగాలు, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఉంటాయన్నారు.

జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మారుస్తాం

ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి సత్యప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జిల్లాలో పారిశ్రామిక హబ్‌గా మార్చడానికి తగిన వనరులు ఉన్నాయని, ఈ మేరకు ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అభివద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్, ఎంపీ పార్థసారథి, కలెక్టర్ టిఎస్.చేతన్‌తో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి నియోజకవర్గంలో తాగునీరు హంద్రీ నీవా పనులు పూర్తి చేయాలని, నియోజకవర్గ మొత్తాన్ని కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాప్తాడు నియోజకర్గంలో అధికంగా పంట నష్టం జరిగిందని వాటిని గుర్తించి రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో పలు మండలాలలో రహదారుల సమస్యలు నెలకొందని వాటి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలన్నారు. తాగు, సాగునీరు సమస్యల పరిష్కరించాలన్నారు. నియోజకవర్గం నుంచి వలసలు వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి పనులు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం రహదారులను నిర్మించడంలో మరమ్మతులు చేయడంలో పూర్తిగా విస్మరించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అవసరమైనచోట్ల కొత్త రహదారులు గుంతల మయమైన రహదారులను వెంటనే మరమ్మతులు చేయించే చర్యలు చేపట్టారన్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని మండలాల్లో రహదారుల పనులను చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లాలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చడానికి ముఖ్యమంత్రి తగిన ఆలోచనలతో ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. అనంతరం కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు ఐదు నెలల కాలంలో చేపట్టిన అభివద్ధి పనులు వివరించారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లా శాఖ అధికారులందరూ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం : మంత్రి

కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులతో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రులు

శ్రీ సత్య సాయి జిల్లా అభివృద్ధికి అన్ని చర్యలూ తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ రిజిస్ట్రేషన్ స్టాంపులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం సాయి అరామంలో కూటమి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీసీ జౌళి సంక్షేమ శాఖ సవితమ్మ తోపాటు ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్.రాజు, ఎంపి పార్థసారథితో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు. ఇన్‌ఛార్జి మంత్రి కూటమి నాయకులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, జిల్లా మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని కోరారు. హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి జిల్లాలోని అన్ని చెరువులకు నీరు అందించాలన్నారు. వీటిపై ఇన్‌ఛార్జి మంత్రి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. జిల్లావ్యాప్తంగా జనసేన. బిజెపి, టిడిపి కూటమి నాయకులు ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కషి చేస్తామన్నారు. ఇక సత్యసాయి జిల్లా మార్పుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

‘పురం’లో క్యాంపు రాజకీయాలు

- త్వరలో మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక
- క్యాంపునకు బయల్దేరిన కౌన్సిలర్లు
- టిడిపితో జతకట్టిన 16 మంది వైసిపి కౌన్సిలర్లు

క్యాంపునకు వెళ్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపాల్టీలో క్యాంపు రాజకీయాలు మొదలయ్యాయి. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రాగానే హిందూపురం మున్సిపాల్టీ పాలకవర్గం తీరు ఒక్కసారిగా మారిపోయింది. ఛైర్మన్ రాజీనామాతో ఇక్కడ నూతన పాలకవర్గం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఇందులో భాగంగా మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక రసవత్తరంగా మారింది. వైసిపి నుంచి పలువురు కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలోకి చేరడంతో ఛైర్మన్ గిరిని టిడిపి సొంతం చేసుకోవడం ఏకపక్షంగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. త్వరలోనే హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్ అయినట్లు సమాచారం రావడంతో ఆ పార్టీ అధిష్టానం కౌన్సిలర్లను క్యాంపునకు తరలించింది. టిడిపి కౌన్సిలర్లతోపాటు 16 మంది వైసిపి కౌన్సిలర్లు టిడిపిలోకి చేరి ఆ పార్టీ కౌన్సిలర్‌లతో సోమవారం సాయంత్రం క్యాంపునకు బయలుదేరారు. గత మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా హిందూపురం మున్సిపాల్టీలో ఉన్న 38 వార్డుల్లో ఏకంగా 30 వార్డుల్లో అధికార వైసిపి కౌన్సిలర్లు విజయం సాధించారు. ఆరు వార్డుల్లో తెలుగుదేశం, చెరో ఒక వార్డులో బిజెపి, ఎంఐఎం అభ్యర్థులు గెలుపొందారు. ఎన్నికల అనంతరం బిజెపి, ఎంఐఎం అభ్యర్థులు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. దీంతో టిడిపి బలం 8కి చేరింది. అప్పట్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్ ఇంద్రజను మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. ఇదిలా ఉండగా సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఒక్కసారిగా మున్సిపాల్టీ ముఖచిత్రం మారిపోయింది. ఎలాగైనా మున్సిపాలిటీలో పట్టు సాధించాలని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇందులో భాగంగా పదిమంది వైసిపి కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీ కండువాను ఎమ్మెల్యే బాలకష్ణ సమక్షంలో కప్పుకున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఓటుతో తెలుగుదేశం పార్టీ బలం 20కి చేరుకుంది. తెలుగుదేశం పార్టీ ఛైర్మన్ అభ్యర్థిగా ఆరో వార్డు కౌన్సిలర్ డిఈ..రమేష్ కుమార్ పేరును ఎమ్మెల్యే ప్రతిపాదించారు. విజయవాడలో తుఫాన్ బీభత్సం కారణంగా మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక ఆలస్యం కావడంతో టీడీపీలో చేరిన పదిమంది వైసిపి కౌన్సిలర్లలో నలుగురు తిరిగి సొంత పార్టీలోకి వెళ్లారు. దీంతో మళ్లీ తెలుగుదేశం బలం పడిపోయింది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం శ్రేణులు ఒకింత ఢీలా పడ్డాయి. ఛైర్మన్ స్థానాన్ని ఎమ్మెల్యే అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో టిడిపి శ్రేణులు తమదైన శైలిలో పావులు కదిపారు. తెలుగుదేశం పార్టీ ఛైర్మన్ స్థానాన్ని చేజిక్కించుకునేలా సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. దీంతో మళ్లీ వైసిపికి చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. కూటమి కౌన్సిలర్లతో పాటు వైసిపిలోకి చేరిన వారితో కలుపుకుని టిడిపి బలం 24కు చేరుకుంది. మున్సిపల్ ఛైర్మన్ స్థానం మళ్లీ తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా మారింది. మరో వారం లోపు మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించే అవకాశం ఉండడంతో కౌన్సిలర్లు ఎవరూ చేజారిపోకుండా ఉండేలా తెలుగుదేశం అధిష్టానం ఆదేశం మేరకు స్థానిక సీనియర్ నేతలు కౌన్సిలర్లను క్యాంపునకు తరలించారు. కూటమి కౌన్సిలర్లతో పాటు వైకాపాకు చెందిన 16 మంది కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లినట్లు సమాచారం. మరో ఆరుగురు వైకాపా కౌన్సిలర్లు సైతం లోపాయికారి ఒప్పందం మేరకు ఛైర్‌పర్సన్ ఎన్నిక జరిగితే గైర్హాజరు అవుతారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఎమ్మెల్యే బాలకష్ణ ఆదేశం మేరకు సీనియర్ టిడిపి నాయకులు ప్రత్యేక బస్సులో కౌన్సిలర్లతో పాటు, కుటుంబ సభ్యులను క్యాంపుకు తీసుకెళ్లారు. ఎన్నికల కమిషన్ తేదీ ప్రకటించిన వెంటనే నేరుగా కౌన్సిలర్లను మున్సిపల్ కార్యాలయానికి తీసుకుని వచ్చేలా ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం క్యాంపునకు వెళ్లిన 24 మంది కౌన్సిలర్లతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే ఓటుతో తెలుగుదేశం పార్టీకి 26 సంఖ్యాబలం ఉండడంతో ఆ పార్టీ ఛైర్మన్‌గా డిఈ.రమేష్ కుమార్ ఎన్నిక లాంఛనమే. ఎన్నిక సజావుగా జరిగితే తిరిగి మున్సిపాలిటీలో తెలుగుదేశం పాగా వేయడం ఖాయం.

పుట్టపర్తి కలెక్టరేట్‌లో మరోసారి కత్తి కలకలం

స్వాధీనం చేసుకున్న కత్తిని చూపుతున్న పోలీసు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి కలెక్టరేట్‌లో మరోసారి కత్తి కలకలం రేగింది. గతంలో ఓ వ్యక్తి రక్షణ పేరుతో కత్తిని తీసుకుని కలెక్టరేట్లోకి వచ్చాడు. తాజాగా సోమవారం నాడు నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఓ మహిళ బ్యాగులో కత్తిని తీసుకని వచ్చింది. తనిఖీ చేసిన పోలీసులు కత్తిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కత్తి తీసుకొచ్చిన మహిళను విచారించగా తనకల్లు మండలం బొంతలపల్లి గ్రామానికి చెందిన ప్రేమలతగా గుర్తించారు. ఆత్మరక్షణలో భాగంగానే కత్తిని బ్యాగులో ఉంచుకుని తిరుగుతున్నట్లు ఆమె తెలియజేసింది. అనంతరం పోలీసులు కత్తిని స్వాధీనం చేసుకుని ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇటీవల కాలంలో కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యాత్మక ఘటనలు తరచుగా చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే పోలీసులు లోపలికి అనుమతిస్తున్నారు.

విఒఎల అక్రమ తొలగింపులు దుర్మార్గం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

విఒఎల అక్రమ తొలగింపులు దుర్మార్గమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్ తెలిపారు. విఒఎలను యథావిధిగా విధుల్లో కొనసాగించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈఎస్.వెంకటేష్ మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు విఒఎలందరినీ యథావిధిగా విధుల్లో కొనసాగించాలన్నారు. ఇందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంటే ఈనెల 23 నుంచి ఆందోళన కార్యాక్రమాలు చేపడతామన్నారు. జిల్లా వ్యాప్తంగా రాజకీయ వేధింపులతో వీఏవోలను అక్రమంగా తొలగించారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ తొలగింపులు జరిగాయన్నారు. హైకోర్టు వీరిని యథావిధిగా కొనసాగించాలని చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. గ్రామైక్య సంఘాల పరిధిలోని పనిచేస్తున్న తీర్మానాలు అన్ని ఉన్నప్పటికీ వీటిని అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ వీటిపై స్పందించి కోర్టు ఉత్తర్వులు ఉన్న వారందరినీ యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఈనెల 23 నుంచి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఏవోలు రంగనాయక్, వెంకట్ రాముడు, సుజాత, సోమశేఖర్, నారాయణస్వామి, హేమలత, మాధవి, నాగరాజు, ఆదినారాయణ పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖ మంత్రికి ఈడిగ సంఘం నాయకుల సన్మానం

ప్రజాశక్తి-పెనుకొండ

సత్యసాయి జిల్లా పర్యటనకు వచ్చిన ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను సోమవారం నియోజకవర్గ ఈడిగ సంఘం నాయకులు పట్టణంలోని రాష్ట్ర బిసి సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత నివాసంలో సన్మానించారు. అలాగే మంత్రి సవితను సన్మానించారు. మంత్రులకు కల్లుకుండలు అందించి భుజాలకు కల్లుగీతకు ఉపయోగించే తాడు వేసి తమ అభిమానం చాటుకున్నారు. కార్యక్రమంలో ఈడిగ సంఘం నాయకులు బిసి సెల్ ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గౌడ్, ఐ టిడిపి రాష్ట్ర కార్యదర్శి రొద్దం పవన్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు హరీష్, ఐ టిడిపి శ్రీశైలం శ్రీనివాసులు, గోపి, టిడిపి ఈడిగ సాధికారిక డైరెక్టర్ వానవోలు మహేష్, శేషాపురం శీన, కంచి సముద్రం హరి, వానవోలు చిన్ననాగప్ప, శేషాపురం అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎంపిపి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

పుట్టపర్తిలో సోమవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎంపిపి ఆదినారాయణ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదినారా యణ వారికి పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని మంత్రలను కోరారు.

గుబులు రేపుతున్న కానిస్టేబుళ్ల సస్పెన్షన్..!

దొంగలకు సహకరించడం పై విమర్శలు - లోతుగా దర్యాప్తు సాగిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్ల వైఖరిని తీవ్రంగా పరిగణించిన పోలీసు ఉన్నతాధికారులు ఆ ఇద్దరిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇటీవల చిలమత్తూరు మండలం నల్ల బొమ్మనపల్లి సమీపంలో అత్తాకోడళ్లపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన విషయం విధితమే. అప్పట్లో దీన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి వంగలపూడి అనిత, డిజిపి ద్వారకా తిరుమలరావులు తీవ్రంగా పరిగణించారు. గంటల వ్యవధిలోని నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. ఈ ఘటనలో తీగ లాగితే డొంక కదిలినట్లు లోతుగా దర్యాప్తు సాగించగా సొంత శాఖలోని ఉన్న లొసుగులు బయటపడ్డాయి. ముఖ్యంగా సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ నిందితులు అనేక దొంగతనాలు, దోపిడీలకు పాల్పడినట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. రికార్డుల ఆధారంగా నిందితులను విచారణ చేసే సమయంలో ఇన్ని కేసులో ఉన్నాయి కదా... పోలీసులు ఎవరూ మిమ్మల్ని మందలించలేదా అని విచారణ అధికారులు నిందితులను అడిగినట్లు సమాచారం. ఆ నిందితులు కొంతమంది పోలీసుల పేర్లు చెప్పినట్లు తెలుస్తోంది. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ తతంగం వెనుక మరో కొంతమంది పోలీస్ కానిస్టేబుళ్లు ఉన్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దొంగలను గుర్తించి వారిని పట్టుకోవాల్సిన పోలీసులు ఇలా వారికి సహకరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. స్టేషన్‌కు సిఐ, ఎస్ఐలు నూతనంగా వచ్చి బాధ్యతలు స్వీకరించిన అనంతరం కొంతమంది కానిస్టేబుళ్లను ఎంపిక చేసుకుని వారి నుంచి వసూళ్లకు పాల్పడేవారని ఆరోపణలు ఉన్నాయి. దీంతోపాటు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐ, ఎస్ఐకు అనుకూలంగా ఉంటూ కొంతమంది పోలీసులు తమదైన శైలిలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. మరి కొందరు మట్కా, జూదం వంటి వాటికి సహకారం అందిస్తూ వారం, నెలసరి మామూళ్లతో పాటు పండుగ మామూళ్లను కూడా వసూలు చేస్తున్నట్లు ఆ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. హిందూపురం నియోజకవర్గంలో పనిచేసే కొందరు పోలీసులు కనీసం యూనిఫాం కూడా ధరించకుండా వసూళ్లే ధ్యేయంగా ఎప్పుడూ మఫ్టీలోనే ఉంటూ దొంగలను పట్టుకుంటున్నట్టు నటిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా వ్యవహరించే కానిస్టేబుళ్ల జాబితాను సిద్ధం చేసిన పోలీసు ఉన్నతాధికారులు ఆయా పోలీసుల పనితీరు, ప్రజలతో సంబంధాలు, వారు గడుపుతున్న విలాసవంతమైన జీవితం, వినియోగిస్తున్న కార్లు, ద్విచక్ర వాహనాలు, నివాసముంటున్న ఇళ్లు, నిర్మాణం చేసిన ఇళ్లు ఇలా ప్రతి అంశం పైన ఆరా తీస్తున్నట్లు సమాచారం. పలువురు పోలీసు అధికారులను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా నియమించి ఆయా అంశాలపై సమగ్రంగా వివరాలు తెప్పించుకుని విచారణ సాగించినట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇందులో భాగంగానే తొలి విడతలో ఇద్దరు కానిస్టేబుళ్లపై చర్యలకు ఉపక్రమించిన ఉన్నతాధికారులు మరి కొందరిపై కూడా వేటువేసే అవకాశం లేకపోలేదు అన్న అభిప్రాయాలు పోలీసు శాఖలో వ్యక్తమవుతున్నాయి. వీరితో పాటు ఇక్కడ పనిచేసిన సిఐలపై సైతం విచారణ చేపడితే పెద్ద అవినీతి తిమింగలాలు బయటపడే అవకాశాలు ఉన్నాయనే చర్చ నడుస్తోంది. ఆ విధంగా ఎస్పీ విచారణ చేపడితే పోలీసు శాఖలో సమూల మార్పులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయనే భావన ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

చిరుద్యోగులపై ఎంజిఎం హెచ్‌ఎం ప్రతాపం

సంతకం పెట్టాలంటే చేయి తడపాల్సిందే.! - 3 నెలలుగా వేతనాల్లేక వాచ్‌మెన్, ఆయాల ఇబ్బందులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ఉన్న ఎంజిఎం పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం చిరుద్యోగులపై ప్రతాపం చూపిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆమెకు ముడుపులు ఇవ్వక పోవడంతో మూడు నెలలుగా వేతనాలను మంజూరు చేయకుండా వేధిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంజిఎం పాఠశాల హెచ్‌ఎం గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ అయ్యారు. కొన్నాళ్లకు మళ్లీ అదే పాఠశాలకు హెచ్‌ఎంగా పోస్టింగ్ తెచ్చుకున్నారు. నెలకు ఆరు వేలు తీసుకునే వారికి వేతనం మంజూరు చేయాలంటే చేయి తడిపితే కాని సంతకం పెట్టని పరిస్థితి ఉందనే విమర్శలు ఉన్నాయి. రూ.2 వేలు ఇస్తేనే శాలరీ బిల్లులపై సంతకం పెడతానంటూ వాచ్మెన్, ఆయాలను ముప్పుతిప్పలు పెడుతున్నట్లు సమాచారం. ప్రతి రోజు ఉదయమే పాఠశాలకు వచ్చి సాయంత్రం దాకా హెచ్‌ఎం గది వద్ద పడిగాపులు కాసినా కనీసం పలకరింపు కూడా చేయదని, మధ్యాహ్నం భోజనంకు కూడా వెళ్లకుండా చిన్న సంతకం కోసం వేచి ఉండాల్సి వస్తుందని ఆ నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2021లో హెచ్‌ఎం తన సొంత నిర్ణయంతో హిందూపురంలోని ఎంజీఎం పాఠశాలకు వాచ్మెన్ నజీర్, ఆయాగా షాహీనలను నియమించుకున్నారు. అప్పటి నుంచి ప్రతి నెలా వారి ఖాతాల్లో డబ్బు పడేది. గత మూడు నెలలుగా శాలరీ బిల్లులపై సంతకం పెట్టడం లేదు. అడిగినా పట్టించుకోవడం లేదని వద్ధ దంపతులు ఆరోపిస్తున్నారు. సంతకం చేయాలంటే రూ. 2 వేలు ఇవ్వాల్సిందే అని, లేక పోతే సంతకం చేయనని చెబుతుందని పేర్కొంటున్నారు. అసలే పేద బతుకులు ఆపై నెలంత చేసిన కష్టానికి వేతనం రాకపోవడంతో తిండి కూడా లేక పస్తులుంటున్నామని బాధితులు వాపోతున్నారు. ఈ విషయంపై హెచ్‌ఎం సామ్రాజ్యంను వివరణ కోరగా తనకు మర్యాద ఇవ్వకుండా మాట్లాడుతున్నారని, అయినా గత నెల వేతనాల బిల్లులపై సంతకం పెట్టానని చెప్పారు. మిగిలిన బిల్లులపై మంగళవారం వస్తే సంతకం పెడతాను అని చెప్పానని తెలిపారు.

గ్రీవెన్స్‌కు హాజరైన అధికారులు

ప్రజాశక్తికి స్పందన

హిందూపురం : ప్రతి సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌కు మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాల్సి ఉంది. గత సమావేశాల్లో పూర్తి స్థాయిలో అధికారులు హాజరు కాక పోవడంపై ప్రజాశక్తిలో కథనం వచ్చింది. దీనిపై స్పందించిన తహశీల్దార్ గ్రీవెన్స్‌కు హాజరు వారి వివరాలను కలెక్టర్ కు వివరిస్తామని తెలిపారు. దీంతో స్పందించిన మండలంలోని వివిధ శాఖల అధికారులు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు పూర్తి స్థాయిలో హాజరయ్యారు.

వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించండి

చిలమత్తూరు : వాల్మీకి జయంతిని జాతీయ పండుగగా గుర్తించి, జాతీయ సెలవుదినంగా ప్రకటించాలని, వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించాలని వాల్మీకి సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం చిలమత్తూరులలో వాల్మీకి సేవా సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు అంజనప్ప, శంకరప్ప, లింగప్ప, ముద్దన్న, నరేంద్ర, నాగేంద్ర, మల్లికార్జున పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజల పక్షాన పోరాటం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న భారాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ తెలిపారు. పట్టణంలోని ఒకటవ వార్డు ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ కాలోనీలో మౌలిక సమస్యల పరిష్కారంపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలన్నారు. రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. పేదల పక్షాన సిపిఎం నిరంతరం పనిచేస్తోందని చెప్పారు. శాఖ, పట్టణ మహా సభలను నిర్వహించి ఆయా ప్రాంతాల్లో నెలకున్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 1, 2వ తేదీల్లో పుట్టపర్తిలో జరిగే జిల్లా మహాసభలో వీటిపై చర్చించనున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలను చేపడుతామన్నారు. అనంతరం శాఖ కార్యదర్శిగా మల్లయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జెడ్‌పి.శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, నాయకులు రాము, మల్లయ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారి జేబులోకి పంచాయతీ పన్ను సొమ్ము..?

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండల పరిధిలోని వీరాపురం గ్రామ పంచాయతీలో పన్ను రూపంలో వసూలు అయిన సొమ్మును ఇన్‌ఛార్జి విస్తరణ అధికారి తన జోబులో వేసుకుంటూ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... దాదిరెడ్డిపల్లి వద్ద ఉన్న కోళ్లఫారంలో వారం రోజుల కితం దాదాపు రూ.8వేలు సొమ్మును యాజమాని నుంచి ఇన్‌ఛార్జి విస్తరణాధికారి వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని సదరు అధికారి పంచాయతీకి చెల్లించకుండా తన జేబులో వేసుకున్నట్లు తెలుస్తోంది. వసూలు చేసిన సొమ్మును నిబంధనల మేరకు పంచాయతీ కార్యదర్శికి అందించాలి. తర్వత కార్యదర్శి ఆ సొమ్మును పంచాయతీ ఖాతాలో జమ చేస్తారు. పన్ను రూపంలో కోళ్ల ఫారం యాజమాన్యం నుంచి వసులు చేసి వారం రోజులు అయినా దీనిని పంచాయతీ ఖాతాలో జమ చేయకపోవడం చర్చనీయాంశం అయింది. దీనిపై కార్యదర్శిని వివరణ కోరగా ఈ విషయం తనకేమీ తెలియదని సమాదానం ఇచ్చారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి అదికారులు విచారణ చేసి వసులు అయిన పన్ను మొత్తాన్ని పంచాయతీ నిధుల్లో జమ అయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బడుగు, బలహీన వర్గాలకు అండగా టిడిపి

సభ్యత నమోదు చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన పార్టీ టిడిపి అని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ తెలిపారు. డైమండ్ ఇర్ఫాన్, 8వ వార్డు ఇన్‌ఛార్జి విశ్వనాథ్ ఆధ్వర్యంలో సోమవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యాక్రమం చేపట్టారు. ఇర్ఫాన్ మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం సిఎం చంద్రబాబు రూ. 100 సభ్యత్వంతో రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పించారన్నారు. సభ్యత్వ నమోదులో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలపాలని సూచించారు. కార్యక్రమంలో పర్వీన్‌బాను, నాయకులు మారుతి ప్రసన్న, ప్రవీణ్‌కుమార్, రాజు, రాఘవ, మారెప్ప, తదితరులు పాల్గొన్నారు.

పిఆర్ ప్రాజెక్టు డీఈగా తిరుపాల్

ప్రజాశక్తి-మడకశిర

పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈగా సి.తిరుపాల్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న డీఈ బదిలీ కావడంతో అనంతపురంలో క్వాలిటీ కంట్రోల్ డీఈగా పని చేస్తున్న తిరుపాల్ ఇక్కడికి వచ్చారు. నూతన డీఈ మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. పిఎంజిఎస్‌వై పథకం కింద రూ. 2.13 కోట్ల వ్యయంతో ఇప్పటికే రోడ్లు మంజూరు చేశారని, ఆ పనులను సత్వరమే పూర్తి చేయడానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చందన, మైనావతి

రాష్ట్రస్థాయి పోటీలకు కెజిబివి విద్యార్థినులు

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు రొద్దం కెజిబివి విద్యార్థినులు ఎంపికైనట్లు ఎస్ఒ. నాగరత్నమ్మ తెలిపారు. అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో గత శనివారం అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో విద్యార్థినులు చందన, మైనావతి పాల్గొని ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వారు ఈ నెల 28, 29, 30 తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను ఎస్ఒతో పాటు పిఇటి రాధ, ఉపాధ్యాయిరాలు సుశీల, అభినందించారు.

బుక్కపట్నం నుంచి...

ప్రజాశక్తి-బుక్కపట్నం

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈత, బాల్ బాడ్మింటన్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం జగదీశ్, పిడి నాగరాజు తెలిపారు. అక్టోబర్ 30వ తేదీ అనంతపురంలో జరిగిన ఎస్‌జిఎఫ్ స్విమ్మింగ్ పోటీల్లో అండర్-19 విభాగంలో పదో తరగతి విద్యార్థులు గోవర్ధన్, మంజునాథ్, అండర్-17 విభాగంలో ధనంజయ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరు నవంబర్ 5 నుంచి 7వ తేదీ వరకూ నరసరావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అలాగే అండర్-14 బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు 8వ తరగతి విద్యార్థి వెంకట సాయి ఎంపికయాడని తెలిపారు. ఈ పోటీలు అన్నమ య్య జిల్లా మొలకల చెరువులో జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం జగదీశ్, పిడి నాగరాజు, జిల్లా ఎపిపిఆర్ అధ్యక్షులు వరప్రసాద్, ఉపాధ్యాయ బందం అభినందించారు.

వాటర్ ప్లాంట్‌లో క్లోరినేషన్

ప్రజాశక్తి-నల్లచెరువు

మండలంలోని చెవిటివారిపల్లి గ్రామంలో ఉన్న సత్యసాయి వాటర్ ప్లాంట్‌లో సోమవారం చేపట్టిన క్లోరినేషన్ ప్రక్రియను స్థానిక పిహెచ్‌సి సిహెచ్ఒ రామచంద్రారెడ్డి పరిశీలించారు. వాటర్ ప్లాంట్ నుంచి వచ్చే నీటిలో క్లోరిన్ శాతంతో పాటు బ్యాక్టీరియా ఏమైనా ఉందా అనే విషయంపై పరీక్షలు నిర్వహించారు. వాటర్ ప్లాంట్‌లోని నీటిని తాగవచ్చని నిర్ధారించారు. ఎంఎల్‌హెచ్‌పి శ్రావణి బ్యాక్టీరియా టెస్ట్ చేశారు. వారి వెంట సూపర్వైజర్ రెడ్డమ్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆశా కార్యకర్త స్వర్ణ, సర్పంచి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని సిద్ధన్నగారిపల్లి గ్రామంలో సోమవారం జిల్లా పశుగణాభివృద్ధి సహకారంతో ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. శిబిరంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టివి.సుధాకర్ పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. అలాగే నట్టల నివారణ మందు తాపారు. పాడి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. పశువైద్యులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ, మెలుకువలు తెలిపారు. శిబిరంలో డాక్టర్ రామేశ్వరరావు, పశువైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

ముదిగుబ్బ : మండలంలోని గాండ్లవారి పల్లి, సున్నాల కొత్తపల్లి గ్రామాల్లోని సచివాలయాలను సోమవారం ఎంపిడిఒ విజయభాస్కర్ సందర్శించారు. ఆయన సచివాలయ సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-అగళి

స్థానిక ఆదర్శ పాఠశాలలో ఒకేషనల్ ట్రైనర్‌గా బ్యూటీ అండ్ వెల్‌నెస్‌లో పని చేస్తున్న ఆర్.నాగరత్నమ్మకు ఉత్తమ అవార్డు వచ్చింది. ఆమెను ఒకేషనల్ కోఆర్డినేటర్ కృష్ణచైతన్య, ప్రిన్సిపల్ జాఫర్, ఆదర్శ పాఠశాల సిబ్బంది సోమవారం అవార్డు అందజేసి సన్మానించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ సిబ్బంది ఇలాంటి అవార్డులు తీసుకొనేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

నాగరత్నమ్మను సన్మానిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

గ్రామ రెవెన్యూ సహాయకుల(విఆర్ఎ) సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ హనుమంతుకి వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో వేతనాలు పెంచాలని విఆర్‌ఎలు విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా చేపట్టగా నాడు ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు ధర్నాలో పాల్గొనడమే కాక టిడిపి అధికారంలోకి రాగానే విఆర్‌ఎల వేతనం రూ. 15 వేలకు పెంచుతామని ప్రకటించారన్నారు. 8 ఏళ్లుగా వేతనాలు పెరగలేదన్న విషయంపై సిఎం చంద్రబాబుకి ఓ సారి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కి 6 దఫాలు, సిసిఎల్ఎకి మూడుసార్లు వినతిపత్రులు ఇచ్చినా ఫలితం లేదన్నారు. సమస్యలు పరిష్కరించక పోగా పైగా విఆర్‌ఎలతో బలవంతంగా నైట్ వాచ్‌మెన్ డ్యూటీలు చేయిస్తున్నారని మండిపడ్డారు.

డిటి హనుమంతుకి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, విఆర్‌ఎలు

ఇది చాలాదన్నట్లు ఇసుక, రైస్ మిల్లు డ్యూటీలు చేయిస్తూ అదనపు పని భారం మోపి, వెట్టిచాకిరీ చేయిస్తు న్నారన్నారు. కనీసం టిఎ, డిఎ ఇవ్వడం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే కనీస వేతనం రూ. 15వేలు ఇవ్వాలని, చట్ట విరుద్ధమైన నైట్ డ్యూటీలు, ఇసుక రైస్ మిల్లు డ్యూటీలు రద్దు చేయాలని, నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, విఆర్‌ఎల సంఘం నాయకులు అంజనప్ప, చెన్నకేశవులు, గోవిందప్ప, సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయవాడ కమిషనరేట్ వద్ద భూనిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పాలసముద్రం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన నాసిన్, బెల్ పరిశ్రమలకు భూములు కోల్పోయిన రైతులు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీ విజయవాడలో కమిషనరేట్ వద్ద ధర్నాకు పిలుపినిచ్చారు. దీంతో సోమవారం భూ నిర్వాసితులు బయల్దేరి వెళ్లారు. వారికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ కావేటి నాగయ్యపల్లి, బాబయ్యపల్లి, పాలసముద్రం గ్రామాల భూ నిర్వాసితులు మూడేళ్లుగా పునరవాసం కల్పించాలని వివిధ రూపాల్లో నిరసనలు, పోరాటాలు చేపట్టారన్నారు. భూములు ఇచ్చి అభివృద్ధికి సహకరించిన పేద రైతులను నట్టేట ముంచారన్నారు. విధి లేని పరిస్థితుల్లో భూ నిర్వాసితులు విజయవాడలో ధర్నాకు సిద్ధమయ్యారని అక్కడ జరిగే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాలన్నారు. జిల్లా అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటలు చెప్పకుండా నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కోశాధికారి సాకే వెంకటేశులు, కమిటీ సభ్యురాలు స్వర్ణలత, భవన నిర్మాణ రంగం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్, భూ నిర్వాసితులు వెంకటలక్ష్మి, అచ్చమ్మ, వెంకట్రామిరెడ్డి, నారాయణ, ఆంజనేయులు, వెంకటరాముడు, రమీజాబి, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు బయల్దేరిన రైతులు

పిఆర్‌సి అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-మడకశిర

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్‌సి అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, కార్యదర్శి సి.తాహిర్‌వలి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపిపి ఎస్‌కెపి పాఠశాలలో యుటిఎఫ్ జోనల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పిఆర్‌సి అమలు చేయాలని, బకాయి డిఎ, పిఎఫ్, ఎపిజిఎల్ఐసిలను విడుదల చేయాలని, తదితర సమస్యలను పరిష్క రించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఈ నెల 10వ తేదీ కదిరి పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు వివిఎన్.మాలింగప్ప, డి.నర సింహప్ప, మూడ్ల గిరియప్ప, దేవరాజు, ఎ.అనిల్ కుమార్, జి.రామాంజనేయులు,ఎం.నజీర్, నంజప్ప, సూర్యప్రకాష్, వంశీకృష్ణ, కాశీ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అలాగే స్థానిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప ఆధ్వర్యంలో మడకశిర, గుడిబండ, రొళ్ల మండలాల యుటిఎఫ్ స్వర్ణోత్సవ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారు. ఆయా మండలాల కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మడకశిర మండల అధ్యక్షుడిగా మాలింగప్ప, ప్రధాన కార్యదర్శిగా జోగప్ప, గుడిబండ మండల అధ్యక్షుడిగా మూడ్ల గిరియప్ప, ప్రధాన కార్యదర్శిగా నరసింహప్ప, రొళ్ల మండల అధ్యక్షుడిగా అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కేశవ్‌ప్రసాద్‌లను ఎన్నుకున్నారు.

యుటిఎఫ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

యుటిఎఫ్ జిల్లా మహాసభల కరపత్రాలు విడుదల

గాండ్లపెంట : కదిరిలో ఈ నెల 10వ తేదీ నిర్వహిస్తున్న యుటిఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు వైవి.సుబ్బా రెడ్డి కోరారు. స్థానిక ఎంఆర్‌సి భవన్‌లో మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ బి.కృష్ణానాయక్, పిటిఎం మురార్‌అలీ, రమణనాయక్, ఖాదర్‌బాషా, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ

కదిరి టౌన్ : యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఈ నెల 10వ తేదీ పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించే యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్లను సోమవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యుటిఎఫ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై 50 ఏళ్ల నుంచి రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి, మైనుద్దీన్, మల్లికార్జున, ఆజంబాషా, డివిజన్ నాయకులు రవివర్ధన్‌రెడ్డి, ఖాజా మొహియిద్దీన్, నజీర్, సంతోష్ కుమార్, హనీఫ్, సునీల్, ఖాదర్‌బాషా, శివరామకృష్ణ, రమణనాయక్, రమేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

'తప్పుడు పత్రాలు సృష్టించి భూమి కాజేశారు'

రెవెన్యూ మంత్రికి బాధితుల మొర

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో రోజురోజుకూ భూమి విలువ పెరిగిపోతున్న నేపథ్యంలో అధికారులు సైతం అవకతవకలకు పాల్పడి తప్పుడు పత్రాలు సృష్టించి భూమి కాజేశారని బాధితులు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని ఎనమలపల్లి గ్రామానికి చెందిన పలువురు బాధితులు సోమవారం పట్టణంలో మంత్రిని కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. యనమలపల్లి రెవెన్యూ పొలంలోని గిరిధర్‌రావు, శివారెడ్డి, చింతా దామోదర్, సాధిక్‌వలి, అమరేశ్వరి, ఉదయభాస్కర్‌ల భూమిని కొందరు అధికారులు నిర్మలాబాయి, అజితాబాయి పేర్ల మీదకు మార్చి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించారన్నారు. అందులో అప్పటి తహశీల్దార్ నవీన్‌కుమార్, ఇతర అధికారుల ప్రమేయం ఉందన్నారు. తమను పోలీసుల చేత బెదిరించి భూమిని ఆక్రమించారని బాధితులు వాపోయారు. స్పందించిన మంత్రి అధికారుల సమక్షంలోనే సమగ్ర విచారణ చేసి కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులు గిరిధర్‌రావు, చింతా దామోదర్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు.

'ఉద్యోగుల వేతనాల్లో కోతలు సబబు కాదు'

మంత్రికి ఎపి ఎన్జీవో అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి నిరంతరం కృషి చేసే ఉద్యోగుల వేతనాల్లో కోతలు పెట్టడం సమంజసం కాదని ఎపి ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యశాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగానే నియామకాలు జరిగాయని, రెగ్యులర్ ఉద్యోగులుగా డీఎస్సీ రూల్స్ ఆధారంగా నియమించబడ్డామ న్నారు. చాలీచాలని వేతనాలతో కాలం వెల్లదీస్తున్నామని అయినా ఇటీవల ప్రభుత్వం ఎఫ్ఆర్‌సితో వేతనాలు అనుసంధానం చేస్తూ ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. ఎఫ్ఆర్‌సి యాప్‌లో లోపాలను పూర్తిస్థాయిలో సవరించి తుదిపరి ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. స్పందించిన మంత్రి మీ విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఆ సంఘం నాయకులు లింగారామ్మోహన్, అజీజ్ ఖాన్, అబీద్‌బాషా ఉన్నారు.

పారిశుధ్యం, ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని కల్లుమర్రి పిహెచ్‌సి హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్, మడకశిర సబ్ యూనిట్ ఆఫీసర్ షమీవుల్లా ఆధ్వర్యంలో సోమవారం గౌడనహళ్లి పంచాయతీలోని తురకవాండ్లపల్లి గ్రామంలో పారిశుధ్యం, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటించి వీధుల్లో దోమల నివారణకు స్ప్రే చేయించారు. అలాగే డెంగీ, మలేరియా, మెదడువాపు, బోధకాలు, తదితర వ్యాధుల లక్షణాలు, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు ఉషాలత, చెన్నకేశవరెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సౌజన్య, ఆశా వర్కర్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సత్యప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

ఇన్‌ఛార్జి మంత్రికి టిడిపి నాయకుల స్వాగతం

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పాలసముద్రం వద్ద సోమవారం మండల టిడిపి నాయకులు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఘన స్వాగతం పలికారు. మంత్రి సత్యప్రసాద్ బెంగళూరు ఎయిర్ పోర్టు నుంచి రోడ్డు మార్గాన పుట్టపర్తికి వెళ్తుండగా విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు పాల సముద్రం వద్ద స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, మనోహర్, సుబ్బారెడ్డి, ఆదినారాయణ, జయచంద్రారెడ్డి, పరమేష్‌నాయక్, ఉదయ్, తిప్పన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

గాండ్లపెంట ఆర్ఐగా అశోక చక్రవర్తి

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆర్ఐగా అశోక్ చక్రవర్తి బాధ్యతలు చేపట్టారని తహశీల్దార్ బి.బాబురావు తెలిపారు. ఆర్ఐ పోస్టు మూడేళ్లుగా ఖాళీగా ఉండగా నల్లచెరువు మండలం లో పని చేస్తున్న అశోకచక్రవర్తి బదిలీపై ఇక్కడికి వచ్చారని తెలిపారు. నూతన ఆర్ఐ వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించే బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కదిరిటౌన్

ఇటీవల కాలంలో సైబర్ నేరాలు అధికమయ్యాయని, కావున సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వీరమారుతి తెలిపారు. పట్టణంలోని భారత్ ఐటిఐ కాలేజీలో సోమవారం ప్రిన్సిపల్ సోమశేఖర్ సహకారంతో విద్యార్థులకు జన సురక్ష, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీరమారుతి మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్ నేరగాళ్లు ఎలా మోసం చేస్తారు, వారి పట్ల మనం అప్రమత్తంగా ఉండాలనే అంశాలపై వివరించారు. ఒకవేళ మీరు మోసపోయారని ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే సమీపంలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. లేదా 'సేవ్ క్రైమ్.జిఒవి.ఇన్' అనే పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీరమారుతి

ప్రభుత్వాలు ప్రజల కోసం పనిచేయాలి

బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు శివరామకృష్ణ

ప్రజాశక్తి-అగళి

ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాలు ప్రజల కోసం పనిచేయాలని బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ కోరారు. మండలంలోని ఆలూడి గ్రామంలో నివాస స్థలం విషయమై ఈరన్నను నాలుగేళ్ల నుంచి పక్కింటి వారు ఇబ్బంది పెడుతున్నారనే విషయం తెలుసుకొని సోమవారం శివరామకష్ణ, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బిస్గానిపల్లి రామాంజనప్ప ఆ గ్రామం వెళ్లి ఈరన్న నివాస ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం తహశీల్దార్‌ను కలిసి ఈరన్నకు వారంలోపు న్యాయం చేయాలని, లేనిచో కార్యాలయం దిగ్బంధం చేస్తామని హెచ్చరిం చారు. స్పందించిన తహశీల్దార్ సమస్య పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఆలూడి గ్రామ ఎస్సీ కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. వారి వెంట చైతన్య వేదిక పెనుకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.రామదాస్, సుధీర్, రవి, భీమ్‌రాజ్, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ యూనస్‌కి వినతిపత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు

చిలమత్తూరును కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరును కరువు మండలంగా ప్రకటించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. చిలమత్తూరులో సోమవారం ఆయన మాట్లా డుతూ జిల్లాలో 32 మండలాలు ఉండగా ప్రభుత్వం 10 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించడం దారుణమన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అతివృష్టితో చిలమత్తూరు మండల వ్యాప్తంగా పంటలు సాగు చేసిన రైతాంగం పూర్తిగా నష్టపోయారన్నారు. గతేడాది కంటే ఈ సంవత్సరం రైతులు అధికంగా పంటలు సాగు చేశారని, అయిరే అయితే సకాలంలో వర్షం కురవక భారీ నష్టం వాటిల్లిందన్నారు. కావున తక్షణమే చిలమత్తూరును కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు రామచంద్ర, సాదాశివరెడ్డి, నాగరాజు, రామంజి, అశ్వత్థరెడ్డి, షమి, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తన వేరుశనగ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-గాండ్లపెంట

రబీలో పంట సాగు చేసే రైతులకు రాయితీపై విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం రైతు సంఘం నాయకులు కెకె. రాజారెడ్డి, ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో తహశీల్దార్ బి. బాబు రావుకు వినత పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు కురవక పోవడంతో విత్తనం వేసిన రైతులకు పంటలు చేతికందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ప్రతి రైతుకూ రుణాలు అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రబీలో సాగు చేసే రైతులకు రాయితీపై విత్తన వేరుశనగతో పాటు పంట నష్టపరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ బాబురావుకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేయూత

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

గ్రామాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఎంపిడిఒ సాయి మనోహర్ తెలిపారు. మండలంలోని చిగిచెర్ల పంచాయతీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, ఎంపిడిఒ సాయి మనోహర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. అనంతరం వారు గ్రామంలో మినీ గోకులం నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. చిగిచెర్ల గ్రామంలో నారాయణస్వామికి మినీ గోకులం కోసం ప్రభుత్వం ప్రభుత్వం ఉపాధి హామీ కింద రూ. 1.85 లక్షలు మంజూరు చేసిందన్నారు. అలాగే గోకులం ప్రాధాన్యతను వివరించారు. పాడిపశువుల సంరక్షణ కోసం ప్రభుత్వం మినీ గోకులాలు తీసుకొచ్చి రాయితీపై ఉపాధి హామీ నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ నిధులను పాడి రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ అనిల్‌కుమార్ రెడ్డి, పశువైద్యశాఖ అధికారి శేఖర్, ఉపాధి హామీ టెక్నికల్ అసి స్టెంట్లు, పశుసంవర్ధక సహాయకులు, సచివాలయ కార్యదర్శి రెడ్డమ్మ, సిబ్బంది, టిడిపి నాయకులు పార్థరెడ్డి, అజయ్‌రెడ్డి, రాఘవరెడ్డి, శేఖర్‌రెడ్డి, చంద్రాయుడు, అశోక్, కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్ హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఒ సాయిమనోహర్, టిడిపి నాయకులు

రైతుల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పరిటాల శ్రీరామ్, చిలకం

ప్రజాశక్తి- ధర్మవరం రూరల్

రైతుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వారు సోమవారం మండలంలోని పోతుకుంట గ్రామచెరువులో గంగపూజ చేసి, జలహారతి ఇచ్చారు. వారు చెరువు వద్దకు చేరుకోగానే అభిమానులు టపాసులు, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ ఎన్డీఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవడం హర్షణీయమన్నారు. ధర్మవరంలో కూడా చెరువులు పూర్తిగా నిండడంతో రైతులు పంటలు సాగు చేసే అవకాశం వచ్చిందని తెలిపారు. గతంలో చెరువులు నిండినా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సాగునీరు ఇవ్వకపోవడంతో రైతులు పంటలు వేసుకోలేక తీవ్రంగా నష్టపోయారన్నారు. అనంతరం శ్రీరామ్ పోతుకుంట గ్రామంలో చేపట్టిన టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోతుకుంట చెరువులో జలహారతి ఇస్తున్న పరిటాల శ్రీరామ్, చిలకం

ఇన్‌ఛార్జి మంత్రికి ఎంపి స్వాగతం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తొలిసారిగా ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో జిల్లా పర్యటన వచ్చి సందర్భంగా సోమవారం పట్టణంలోని సాయి ఆరామంలో మంత్రికి ఎంపి బికె.పార్థసారథి ఆత్మీయ స్వాగతం పలికారు. ఎంపితో పాటు గోరంట్ల మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, యువ నాయకులు నరేంద్ర రాయల్, చిన్న రాయల్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు.

పంచాయతీ సెక్రటరీ మృతి

కదిరిటౌన్ : ఇటీవల మండల పరిషత్‌లో పని చేస్తున్న పంచాయతీ సెక్రటరీల బదిలీల ప్రక్రియ చేపట్టారు. అయితే ఐదేళ్లు పూర్తి కాని కొందరిని జిల్లా అధికారులు ఉన్నఫళంగా బదిలీ చేశారు. ఈ కోవలోనే బదిలీ అయిన పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై సోమవారం ఆకస్మికంగా మృతి చెందినట్లు తెలుస్తోంది. వివరాలు.. రాజశేఖర్‌రెడ్డి గతంలో కదిరి మండలంలోని కొండమనాయునిపాల్యం సచివాలయంలో పని చేసేవారు. ఆయనను ఎన్‌పికుంట మండలంలోని బలిజపల్లికి బదిలీ చేశారు. దరఖాస్తు చేయకపోయినా బదిలీ చేశారని ఆయన తోటి పంచాయతీ సెక్రటరీలతో ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. జిల్లా కలెక్టర్‌ను సైతం కలిసి తన ఆరోగ్య సమస్యలను తెలుపుతూ వినతి పత్రం సమర్పించారు. అయినా అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో లోలోన మదన పడుతూ మృతి చెందినట్లు తెలుస్తోంది. సహచర ఆప్తున్ని కోల్పోవడంతో తోటి ఉద్యోగులు విచారం వ్యక్తం చేశారు.

నేరాలు ఘోరాలు

అదనపు కట్నం వేధింపులపై ఎస్పీకి ఫిర్యాదు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అత్తింటి వారు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని సోమవారం మండలంలోని పెడబల్లి గ్రామానికి చెందిన హరిణిబాయ్ జిల్లా ఎస్పీ వి.రత్నకు ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాలు.. రాహుల్‌నాయక్, హరిణిబాయ్ భార్యభర్తలు. వారికి 18 నెలల కూతురు ఉంది. రాహుల్ అనంతపురంలో నివాసం ఉంటూ గుంతకల్లు రైల్వే డివిజన్‌లో ఉద్యోగం చేస్తు న్నాడు. వివాహ సమయంలో 20 తులాల బంగారం, కారు కొనుగోలుకు రూ. 8.7లక్షలు ఇచ్చారు. అయినా అదనపు కట్నం కోసం తరచూ వేధిస్తూ పెడబల్లి లో ఉన్న 10 సెంట్ల స్థలాన్ని రాయించుకుని రావాలని, లేనిచో కాపురానికి రావద్దని బెదిరించాడు. కనీసం బిడ్డను చూడడానికి కూడా రాలేదని ఆమె ఎస్పీ ముందు కన్నీరు మున్నీరయ్యారు. గతంలో విజయవాడలో ఒక యువతతో నిశ్చి తార్థం చేసుకుని కట్న కానుకల విషయంలో పెళ్లి రద్దు చేసుకున్నాడని, ఆ విషయం దాచి తనను పెళ్లి చేసుకున్నాడని ఆమె తెలిపింది. ప్రస్తుతం గర్భిణి అని చూడకుండా ఇంటి నుంచి గెంటేశారని వాపోయింది. ఆడపడుచు, అత్త, భర్త వేధింపులకు గురి చేస్తున్నారని, తనకు ప్రాణహాని ఉందని ఆమె ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

బైక్ చోరీకి యత్నం.. అడ్డుకున్న స్థానికులు..

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని ఆంజనేయస్వామి కాలనీలో సోమవారం నారాయణప్ప తన ఇంటి వద్ద ద్విచక్ర వాహనాన్ని ఉంచాడు. ఒడిసి మండలంలోని వీరప్పగారిపల్లికి చెందిన శ్రీనివాసులు ఆ ద్విచక్ర వాహనాన్ని అపహరించేందుకు కొంత దూరం వాహనాన్ని తీసుకెళ్లాడు. గమనించిన స్థానికులు ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్తున్న శ్రీనివాసులును పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

ఆర్టీసీ కండక్టర్‌పై ప్రయివేట్ బస్సు డ్రైవర్ దాడి

ప్రజాశక్తి-మడకశిర

ఆర్టీసీ అధికారులు సమయానికి బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే మడకశిర నుంచి కర్నూలుకు ఏర్పాటు చేసిన బస్సు సోమవారం నిలిచిపోవడంతో ప్రయాణికులు నానా తంటలు పడ్డారు. వివరాలు.. గతంలో ఉదయం 7.30 గంటలకు మడకశిర నుంచి కర్నూలుకు ఆర్టీసీ బస్సు నడిపేది. ఇటీవల దాని స్థానంలో ప్రయివేట్ వారికి అవకాశం ఇవ్వగా ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆ బస్సును ప్రారంభించారు. అయితే ఆ బస్సు డ్రైవర్ సోమవారం ప్రభుత్వ కండక్టర్‌పై దాడి చేయడంతో ఆ బస్సును నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తమ ఆధీనంలో ఉన్న బస్సులను అధికారులు ప్రయివేట్‌కు అప్పగించడంతో ఆ డ్రైవర్, యజమానులు ప్రభుత్వ కండక్టర్‌పై దాడి చేయడం ఏమాత్రం సమంజసం కాదని ఆర్టీసీ సిబ్బంది వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు ఆర్టీసీ బస్సులను రద్దు చేసి ప్రయివేట్ వారికి అవకాశం కల్పించడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని, వెంటనే ఆ బస్సులను రద్దు చేసి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న బస్సులు నడపాలని ప్రయాణికులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక డిపో మేనేజర్ రామసుబ్బయ్యను వివరణ కోరగా ఈ విషయంపై ఇప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, దానిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పేకాటజూదరులు అరెస్టు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని వేల్పుమడుగు గ్రామంలో సోమవారం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 3,650 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. వేల్పుమడుగు గ్రామ బిసి కాలనీలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందంతో ఎస్ఐ కానిస్టేబుళ్లు జనార్దన్, నారాయణస్వామి, హోంగార్డు నారాయణస్వామిలతో కలిసి పేకాటస్థావరంపై దాడి చేశారు. దాడుల్లో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.